సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



అన్నదానానికి భారీ విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వర అన్న దాన ట్రస్ట్‌కు కూనపరెడ్డి శ్రీనివాసరావు, దీప్తి దంపతులు (విజయవాడ) శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.




రారండోయ్ రాములోరి కల్యాణానికి..

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మ వారు పెళ్లిపెద్దలుగా.. రత్నగిరి క్షేత్ర పాలకుడైన శ్రీరాముని ఆలయంలో నవమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

8లో

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 10,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,300 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.50 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

బియ్యపు గింజపై రామాష్టకం



వరుసక్రమంలో అమర్చిన రామాష్టకం రాసిన బియ్యపు గింజలు



పెద్దింటి కృష్ణవంశీ

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డి పాలెం ప్రాంతానికి చెందిన పెద్దింటి కృష్ణవంశీ బియ్యం గింజలపై శ్రీరామ అష్టకం లిఖించి తన భక్తిని చాటుకున్నాడు. గతంలో బియ్యం గింజలపై వందేమాతరం, విద్యుత్ బల్బులో బొమ్మలు, వాటర్ బాటిల్‌లో అగ్గిపెట్టెలు అమర్చడం వంటి వివిధ ప్రయోగాలు చేసి కృష్ణవంశీ 20 ప్రపంచ రికార్డులు సాధించాడు. తాజాగా ఆదివారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరామ అష్టకాన్ని 151 బియ్యం గింజలపై రాసాడు. అతనిని పలువురు స్థానికులు అభినందించారు.

8 నుంచి ఇండో - అమెరికా సైనిక విన్యాసాలు

కాకినాడ రూరల్: భారత్ – అమెరికా దేశాల సైనిక దళాల సంయుక్త విన్యాసాలకు కాకినాడ సాగర తీరం మరోసారి వేదిక కానున్నది. ఇరు దేశాల మధ్య సైనిక సహకారం, పరస్పర నైపుణ్యం పెంపొందించుకునే లక్ష్యంతో టైగర్ ట్రయాంఫ్–2025 పేరిట 13 రోజుల పాటు ఈ విన్యాసాలు జరగనున్నాయి. ఈ నెల 1న విశాఖ సాగర తీరంలో ఈ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. దీనికి కొనసాగింపుగా ఈ నెల 8 నుంచి కాకినాడ తీరంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. విన్యాసాలు ఈ నెల 13న కాకినాడలో ముగియనున్నాయి. తూర్పు నౌకా దళంతో పాటు ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ బలగాలు, అమెరికా సైనిక దళాలు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. కాకినాడ సూర్యారావుపేటలోని నేవల్ ఎన్‌క్లేవ్ వద్ద ఇరు దేశాల ఉమ్మడి విన్యాసాల నిర్వహణకు చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే విశాఖ నుంచి వచ్చిన నావికా దళాలు గుడారాలు ఏర్పాటు చేసుకుని తమ పనిలో నిమగ్నమయ్యాయి. ప్రస్తుతం తూర్పు నౌకాదళ పరిధిలోని విశాఖ, కాకినాడ తీర ప్రాంతంలోని సముద్ర జలాల్లో ఐఎన్ఎస్ జలాశ్వ, యూఎస్ఎస్ కామ్‌స్టాక్ ద్వారా ఇండో, అమెరికా నావికా దళాలు విన్యాసాలు కొనసాగిస్తున్నాయి.

కిటకిటలాడిన శృంగార వల్లభుని ఆలయం

పెద్దాపురం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయం శనివారం కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా రూ.3,25,934 ఆదాయం సమకూరిందని ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఐదు వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

హెపటైటిస్ హడల్..!

- తల్లడిల్లుతున్న పల్లం గ్రామం
- చురుకుగా వైద్య పరీక్షలు
- అంతకంతకూ పెరుగుతున్న కేసులు
- ఆందోళనలో మత్స్యకారులు



పల్లం గ్రామం

సాక్షి, అమలాపురం/కాట్రేనికోన: రోజుల తరబడి సాగుతున్న రక్త పరీక్షలు.. పరీక్షలు జరుగుతున్న కొద్దీ బయటపడుతున్న కామెర్ల సంబంధిత వ్యాధులతో మత్స్యకార గ్రామం పల్లం తల్లడిల్లుతోంది. కాట్రేనికోన మండలం శివారు గోదావరి నదీపాయల మధ్య ఉండే ఈ గ్రామంలో హెపటైటిస్ వ్యాధి ప్రబలడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కామెర్ల సంబంధిత వ్యాధులు గ్రామంలో పెద్ద ఎత్తున వెలుగుచూస్తున్నాయి. గ్రామంలో తొలుత నలుగురు గర్భిణుల్లో కాలేయానికి సంబంధించి వాపు లక్షణాలను గుర్తించారు. వీరు కాకినాడలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలకు వెళ్లిన సమయంలో ఇది బయట పడింది. అక్కడి నుంచి వచ్చిన సమాచారంతో ఇక్కడ కొంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా మరిన్ని కేసులు వెలుగు చూశాయి. దీంతో గ్రామంలో ఉన్న అందరికీ వైద్య పరీక్షలు చేస్తున్నారు. గ్రామంలో మొత్తం 12 వేల వరకు జనాభా ఉండగా, వీరిలో 7,800 మంది వరకూ నివసిస్తున్నారు. మిగిలిన వారు ఇతర ప్రాంతాల్లో వేటకు, ఉద్యోగ, ఉపాధికి వెళ్లారు. గ్రామంలో ఉన్న 18 ఏళ్ల వయస్సు దాటిన వారికి వైద్య పరీక్షలు చేస్తున్నారు.

వైద్య, ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఇప్పటి వరకూ 2,281 మందికి పరీక్షలు నిర్వహించగా, వీరిలో హెపటైటిస్–బి సర్ఫేస్ యాంటిజెన్ (హెచ్‌బీఎస్ఏజీ) 12 మందికి నిర్ధారణ అయ్యింది. హెపటైటిస్–సి వైరస్ (హెచ్‌సీవీ) తొమ్మిది మందికి పాజిటివ్‌గా నిర్ధారించారు. గ్రామంలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో హైపటైటిస్– ఎ, బి, సి కేసులు వెలుగు చూస్తున్నాయి. శనివారం ఒక్క రోజే 118 మందికి పరీక్షలు నిర్వహించారు. అయితే గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో తొలి దశలో చేపట్టిన ర్యాపిడ్ టెస్టులో ఇంతకు రెండు మూడు రెట్లు పాజిటివ్ కేసులు వెలుగు చూడడంతో స్థానికుల్లో ఆందోళన పెరుగుతోంది. వైద్య, ఆరోగ్య శాఖతో సంబంధం లేకుండా స్థానికంగా వైద్య పరీక్షలు, ఇంజెక్షన్లు చేసే వారు ఒకే సిరంజిని ఎక్కువ మందికి వినియోగించడం, గ్రామంలో మత్స్యకారుల సామూహిక జీవన విధానం వల్ల ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వేగంగా సంక్రమిస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఇప్పుడు అప్రమత్తమైనప్పటికీ పెద్ద సంఖ్యలో ఒకరి నుంచి ఒకరికి వ్యాధి సంక్రమిస్తోంది భావిస్తున్నారు. మరిన్ని పరీక్షలు జరిగితే మరికొంత మందిలో ఈ వ్యాధి లక్షణాలు బయటపడే అవకాశముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఇక్కడ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తోంది. అలాగే, వ్యాధి లక్షణాలున్న వారికి అవగాహన కల్పించడంతో పాటు మందులు అందజేస్తున్నారు. వారం పది రోజులుగా ఇక్కడ కామెర్లు ప్రబలుతూండగా జిల్లా యంత్రాంగం కేవలం పరీక్షలతో సరిపెడుతోందని, వ్యాధికి సంబంధించిన మందులు వ్యాధిగ్రస్తులకు ఇంకా అందలేదని స్థానికులు చెబుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో పరీక్షలు ముమ్మరం

నెలవారీ వైద్య పరీక్షల్లో భాగంగా పల్లం గ్రామంలో కొంత మందికి కాలేయ సంబంధ వ్యాధులైన హెపటైటిస్ బి, సి పాజిటివ్ కేసులు నమోదు కావడంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గత నెల 20న ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. ఈ మేరకు కలెక్టరు ఇంటింటా రక్త నమూనాలు సేకరించి, ర్యాపిడ్ కిట్లతో కాలేయ పరీక్షలు చేయాలని ఆదేశించారు. గత నెల 24న రక్త నమూనాలు సేకరించి, పరీక్షలు చేసేందుకు అవసరమైన ర్యాపిడ్ కిట్లను



పల్లంలో రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

పల్లం హెల్త్ సెంటర్‌కు పంపించారు. గత నెల 25 నుంచి వైద్యాధికారుల పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఆరు బృందాలుగా



స్థానికులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు

ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలు సేకరించి, ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ వరకు రక్త నమూనాలు సేకరిస్తామని వైద్యాధికారులు చెబుతున్నారు. గ్రామంలో 18 ఏళ్లు పైబడిన మొత్తం 5,436 మందికి రక్త నమూనాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి వరకు 2,318 మంది రక్త నమూనాలు సేకరించి ర్యాపిడ్ టెస్టులు చేయగా హెపటైటిస్–బి 223, హెపటైటిస్–సి 80 చొప్పున కేసులు నమోదయ్యాయి. కాట్రేనికోన వైద్యాధికారి లిఖిత మాట్లాడుతూ, పాజిటివ్ వచ్చిన వారి రక్త నమూనాలను అదనపు పరీక్షల కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి పంపిస్తామని చెప్పారు. మరిన్ని పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ కేసులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న యాంటీ వైరల్ మాత్రలు అందచేస్తామన్నారు.

వారం రోజుల్లో పరీక్షలు పూర్తి



గ్రామంలో హైపటైటిస్ పాజిటివ్ కేసులు ఎక్కువగా ఉన్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దీనిపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్నాం. అన్ని రకాల వైద్య సేవలూ అందిస్తున్నాం. వారం రోజుల్లో పరీక్షలు పూర్తి చేస్తాం.

– దుర్గారావుదొర, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

వైద్యులకు పూర్తి సహకారం



కామెర్ల సంబంధిత వ్యాధులు ప్రబలుతూండటంతో గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాం. తాగు నీటి నాణ్యతపై మరింతగా దృష్టి సారించాం. వైద్య పరీక్షలకు సహకరించాల్సిందిగా గ్రామస్తులకు అవగాహన కల్పించడంతోపాటు వైద్యులకు అన్ని రకాలుగా సహకరిస్తున్నాం.

– మల్లిడి వీరబాబ్జీ, సర్పంచ్, పల్లం, కాట్రేనికోన మండలం

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్



బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణ రావు, ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం టౌన్: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, మాదగ నాయకులు నివాళులర్పించారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆయన నీతి నిజాయితీగా పనిచేయడమే కాకుండా 30 ఏళ్ల కేంద్ర మంత్రిగా, 50 సంవత్సరాలు ఎంపీగా పనిచేసిన చిర స్మరణీయుడని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఆయనకు భారత రత్న ఇవ్వాలని, అమలాపురంలో ఆ మహనీయుని కాంస్య విగ్రహాన్ని నెలకొల్పాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, దళిత ఐక్య వేదిక జిల్లా చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మడికి శ్రీరాములు, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, దండోరా నాయకుడు యార్లగడ్డ రవీంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, బంగారు గోవింద్, కట్టోజు సన్నయ్యదాసు, నాగారపు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిక్కాల రవిశంకర్, సాగిరాజు సాయిరాజు, తదితరులు పాల్గొని బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు.

సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు : జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: దళితుల ఆశాజ్యోతిగా, అణగారిన వర్గాల అభ్యుదయం, హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జేసీ టి.నిశాంతి పిలుపు నిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్ జయంతిని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. డీఆర్ఓ రాజకుమారి మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం, వారి పట్ల వివక్షను నిర్మూలించేందుకు పోరాడిన మహనీయుడు అని అన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జిల్లా సాధికారత అధికారిణి ఎం.జ్యోతిలక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్ కేవీవీఆర్ రాజు, ఎల్‌డీఎం కేశవ వర్మ, డీఎంఅండ్ హెచ్ఓ ఎం.దుర్గారావు దొర, డీటీఓ రామనాథం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు, కలెక్టరేట్ ఏవో కె కాశీ విశ్వేశ్వరరావు ఎస్‌డీసీ కృష్ణమూర్తి జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి నరసింహారావు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ దళిత నేత జంగా బాబూ రావు, వసతి గృహ సంక్షేమ అధికారులు కలెక్టరేట్ ఉద్యోగులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకుందామా వాడపల్లీశుని..

- స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు
- ఒక్క రోజు ఆదాయం రూ 43.64 లక్షలు

కొత్తపేట: ఆపద మొక్కుల వాడా.. అనాథ రక్షకా.. గోవిందా.. గోవింద అంటూ భక్తులు వాడపల్లి వేంకటేశుని వేనోళ్ల కొలిచారు. భక్తి పారవశ్యంతో ఓలలాడారు. కోనసీమ తిరుమలగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచీ అన్ని దారుల్లో భక్తులు వాడపల్లి బాట పట్టారు. భక్తుల సౌకర్యార్థం దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ఉదయం సుప్రభాత సేవ నిర్వహించారు. వేంకటేశ్వర సహిత ఐశ్వర్యలక్ష్మీ హోమం నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేశారు. కోరిన కోర్కెలు తీరిన అనేకమంది



స్వామి దర్శనానినకి క్యూ కట్టిన భక్తజనం

స్వామివారి దర్శనానికి కాలి నడకన క్షేత్రానికి చేరుకున్నారు. వేలాది మంది భక్తుల రాకతో క్యూలైన్లు నిండిపోయాయి. స్వామి దర్శనానంతరం ఆ ప్రాంగణంలో కొలువైన అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు.

వెంకన్న ఆదాయం రూ.43.64 లక్షలు

దేవస్థానానికి శనివారం సాయంత్రం 4 గంటల వరకూ వచ్చిన ఆదాయ వివరాలు ఇలా ఉన్నాయి. స్వామి వారి విశిష్ట దర్శనం ద్వారా రూ 11,19,400, స్వామివారి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.7,53,900, వేదాశీర్వచనం ద్వారా రూ. 12,62,196, లడ్డు ప్రసాదం ద్వారా రూ.5,60,820, శాస్వత అన్నదానం నిమిత్తం రూ.,81,504, నిత్య అన్నదానానికి రూ.1,36,548, ఆన్‌లైన్ టిక్కెట్లు ద్వారా రూ.1,33,411 పాటు వివిధ రూపాల్లో మొత్తం రూ.43,64,304 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్య చక్రధరరావు తెలిపారు.

శనైశ్చరునికి పూజలు, తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు చేయించుకున్నారు. శనికి ప్రీతికరమైన శనివారాన్ని పురస్కరించుకుని దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రాతఃకాలంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్లు ద్వారా దేవస్థానానికి రూ.2,27,930, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.31,534 తో మొత్తం రూ.2,59,464 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు.



అప్పనపల్లి బాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బాలబాలాజీ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి క్షేత్రంలో కొలువై ఉన్న బాల బాలాజీ స్వామిని శనివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారు జామున స్వామి వారికి అర్చక స్వాములు సుప్రభాత సేవ నిర్వహించారు. తదుపరి తొలి హారతి ఇచ్చి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. వివిధ సేవల ద్వారా స్వామికి రూ.2,20,146 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు 44,273 విరాళాలుగా అందించారన్నారు. నాలుగు వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారని, 2,500 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

ప్రమాదాల కాలం.. అప్రమత్తం..!

- వేసవిలో అగ్ని ప్రమాదాలకు అవకాశం
- అవగాహనతో భారీ నష్టాలకు చెక్
- అగ్నిమాపక కేంద్రాల్లో సిబ్బంది కొరత

రాయవరం: భానుడు భగ్గుమంటున్నాడు. మార్చిలోనే మే నెల వచ్చిందా అన్నట్టు ఉష్ణోగ్రతలు మండిస్తున్నాయి. ఈ ఏడాది 45 డిగ్రీలను దాటుతుందని వాతావరణ శాస్త్రవేత్తలు ఇప్పటికే హెచ్చరించారు. ఈ కాలంలో అగ్నిప్రమాదాలు సంభవించడానికి అవకాశాలెక్కువ. మండే ఎండలకు తోడు ఇటువంటివి సంభవిస్తే ఆస్తి, ప్రాణనష్టాలు కూడా జరిగే పరిస్థితి ఎదురవుతుంది. మార్చి నుంచి జూన్ వరకు నాలుగు నెలల పాటు ప్రజలతో పాటు అగ్ని మాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏటా ఏప్రిల్‌లో జాతీయ అగ్నిమాపక దినోత్సవం

వేసవిలో జరిగే అగ్ని ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం పరిపాటి. 1994 ఏప్రిల్ 14న ముంబైలోని ఓడలరేవులో జరిగిన అగ్నిప్రమాద ఘటనకు గుర్తుగా ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అగ్ని మాపక కేంద్రాలు 20 కిలోమీటర్ల లోపే ఉన్నప్పటికీ పెద్ద ప్రమాదాలు సంభవించినప్పుడు నిమిషాల వ్యవధిలోనే జరగాల్సిన నష్టం అంతా జరిగి పోతుంది.

ప్రమాదాలూ అధికమే

కోనసీమ జిల్లాలో పి.గన్నవరం నియోజకవర్గం కేంద్రం మినహా, మిగిలిన ఆరు నియోజకవర్గ కేంద్రాల్లో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. పి.గన్నవరంలో అగ్ని మాపక కేంద్రం ఏర్పాటుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆమోదముద్ర వేసింది. ఈ ఏడాది పి.గన్నవరంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసే అవకాశముంది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా 331 అగ్నిప్రమాదాలు సంభవించాయి. వీటిలో రూ.10 లక్షలకు పైగా నష్టం సంభవించిన ప్రమాదాలు నాలుగు కాగా, మీడియం ఫైర్ కాల్స్ (రూ.2 లక్షల నుంచి రూ.10లక్షల లోపు)31, 275 చిన్నపాటి అగ్ని ప్రమాదాలు సంభవించాయి. జిల్లా వ్యాప్తంగా జరిగిన 331 అగ్ని ప్రమాదాల్లో రూ.4 కోట్ల వరకు ఆస్తి నష్టం సంభవించగా, రూ.9.73 కోట్ల ఆస్తిని అగ్నిమాపక సిబ్బంది కాపాడగలిగారు. ఈ ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా, 12 మందిని అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలకు తెగించి కాపాడగలిగారు. అలాగే ఈ ప్రమాదాల్లో మూడు పశువులు చనిపోగా, ఆరు పశువులను సిబ్బంది కాపాడారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో ఆరు ఫైర్ స్టేషన్లకు సిబ్బంది కొరత వేధిస్తుంది. జిల్లా ఫైర్ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులు రెండు, లీడింగ్ ఫైర్‌మెన్ పోస్టులు మూడు, డ్రైవర్ ఆపరేటర్ పోస్టులు ఆరు, ఫైర్ మెన్ పోస్టులు 37 ఖాళీలు ఉండగా, హోమ్‌గార్డు పోస్టులు 14 ఉండగా, ఒక్క హోమ్ గార్డు పోస్టు కూడా భర్తీ కాలేదు. ముఖ్యంగా డ్రైవర్ ఆపరేటర్ పోస్టుల ఖాళీలు ఇబ్బంది పెడుతున్నాయి. ప్రతి స్టేషన్‌కు మూడు డ్రైవర్ ఆపరేటర్ పోస్టులు ఉండాల్సి ఉండగా, ప్రతి స్టేషన్‌కు ఇద్దరు మాత్రమే ఉన్నారు. వీరిపైనే అదనపు భారం పడుతోంది. కొన్ని స్టేషన్లలో కొత్త వాహనాలు ఉండగా, కొన్ని స్టేషన్లలో పాత వాహనాలతోనే నెట్టుకొస్తున్నారు.

అవగాహన కోసమే వారోత్సవాలు

అగ్ని ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రభుత్వం ఏటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ వారోత్సవాల్లో భాగంగా, విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బందికి నివాళులర్పించడం, బస్టాండ్, మాల్స్/మార్కెట్లు, సినిమా థియేటర్లు, మురికివాడల్లో అగ్నిమాపక పరికరాల ప్రదర్శన, అవగాహన కల్పించడం, అపార్ట్‌మెంట్ల వద్ద ఎల్‌పీజీ సేఫ్టీ, నిర్లక్ష్యంగా పొగతాగడం, అగ్ని మాపక నియంత్రణ పరికరాల వినియోగం, అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన, ఎల్‌పీజీ స్టోరేజీ, పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన, ఆస్పత్రుల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు, రోగులకు అగ్నిమాపక నియంత్రణపై అవగాహన, అంగన్‌వాడీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తారు.

జిల్లాలో ఫైర్ స్టేషన్ల నంబర్లు

ఫైర్ స్టేషన్	ఫోన్ నంబర్లు	ల్యాండ్ నంబరు
అమలాపురం	99637 27665	08856-231101
ముమ్మిడివరం	99637 28285	08856-271101
రాజోలు	99637 27827	08862-221101
కొత్తపేట	99637 28051	08855-243299
రామచంద్రపురం	99637 27545	08857-242401
మండపేట	99637 27741	08855-232101



రాయవరం మండలం సోమేశ్వరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో అగ్నికి ఆహుతవుతున్న ఇళ్లు (ఫైల్)



అగ్ని మాపక శకటం



ఫైర్‌స్టేషన్ ఎంబ్లమ్

గత మూడేళ్ల ప్రమాదాల వివరాలిలా...

సంవత్సరం	ఫైర్ కాల్స్	ఆస్తి నష్టం	కాపాడిన ఆస్తి
2021-22	343	43,69,600	4,03,52,000
2022-23	320	3,27,83,800	7,68,84,400
2023-24	334	41,82,30,000	19,86,89,000

అవగాహన కల్పిస్తున్నాం



అగ్ని ప్రమాదాలను అదుపు చేయడంతో పాటు ప్రమాదాలపై ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైన వారికి శిక్షణ ఇస్తున్నాం. ఇంట్లో వంట చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– పార్థసారథి, జిల్లా విపత్తుల స్పందన అధికారి, అమలాపురం

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు

- గ్యాస్‌స్టౌను సిలిండర్ కన్నా ఎత్తులో ఉంచి వాడాలి.
- అదనపు సిలిండర్‌ను వాడుతున్న సిలిండర్‌కు దూరంగా ఉంచాలి.
- కిరోసిన్, డీజిల్, పెట్రోల్‌ను సిలెండర్‌కు దూరంగా ఉంచాలి.
- చిన్నారులకు అగ్గిపెట్టెలు, లైటర్లు అందుబాటులో ఉంచరాదు.
- వంట పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆపివేయాలి.
- ఐఎస్ఐ మార్కు ఉన్న ఎల్‌పీజీ సురక్ష ట్యూబులనే వాడాలి.
- గ్యాస్ లీక్ అవుతున్న అనుమానం వస్తే కిటికీలు, తలుపులు వెంటనే తెరవాలి. ఎలక్ట్రికల్ స్విచ్ ఆన్ అఫ్ చేయకూడదు.
- ఒక ఎలక్ట్రిక్ పాయింట్ వద్ద ఎక్కువ ప్లగ్గులు పెట్టరాదు.
- ఇళ్లు వదిలిదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ మెయిన్ ఆఫ్ చేయాలి.
- విద్యుత్ పరికరాలకు నిప్పు అంటుకుంటే మెయిన్ ఆఫ్ చేసి పొడి ఇసుక లేదా డ్రై కెమికల్ పౌడర్‌ను నిప్పు మీద చల్లాలి.
- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పి పారేయాలి.
- దుస్తులకు నిప్పు అంటుకుంటే పరుగెత్తరాదు. నేలపై దొర్లాలి లేదా దుప్పటి చుట్టుకోవాలి.
- కాలిన శరీర భాగాల మీద చల్లని నీరు పోయాలి.
- పొగతో నిండిన గదుల్లో మోచేతులు, మోకాళ్లపై ప్రాకాలి.
- గడ్డివాములను నివాస గృహాలకు తప్పనిసరిగా 60 అడుగుల దూరంలో వేసుకోవాలి.
- గడ్డివాములను గాలివాటంగా రైట్ యాంగిల్స్‌లో ఏర్పాటు చేసుకోవాలి.
- గుడిసెలకు మధ్య 30 అడుగుల దూరాన్ని పాటించాలి.
- కర్మాగారాల్లో పరిసరాల పరిశుభ్రతను అవసరం.
- కార్మికులు పనిచేసే స్థలాల్లో కనీసం రెండు ఫైర్ ఎక్స్టింగ్విషర్లు ఏర్పాటు చేయాలి.

క్లుప్తంగా

ఆఫీసర్స్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా విజయ రెడ్డి



డాక్టర్ విజయ రెడ్డిని అభినందిస్తున్న వైద్యులు ఉద్యోగులు

అమలాపురం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పశుసంవర్ధక శాఖ ఆఫీసర్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అమలాపురం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయ రెడ్డి ఎన్నికయ్యారు.

ఈ నెల 4వ తేదీన కాకినాడ వీపీసీ మీటింగ్ హాల్లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పశుసంవర్ధక శాఖ ఆఫీసర్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు డాక్టర్ కీర్తి రామకృష్ణ అధ్యక్షతన జరిగాయి. అధ్యక్షుడిగా డాక్టర్ సీహెచ్ బాలచంద్ర యోగేశ్వర్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ ఎల్.విజయ రెడ్డి ఎన్నికయ్యారు. విజయ రెడ్డిని జిల్లా పశువైద్య అధికారి కె.వెంకట్రావు, ఉప సంచాలకులు కర్నీడీ మూర్తి, వైద్యులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

పేపరు మిల్లు ఉద్యోగి అదృశ్యం



ఎన్‌ఫీల్డ్ మోటార్ బైక్‌తో సునీల్‌కుమార్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక హుకుంపేటలోని అత్తారింటి నుంచి తన సొంతిల్లు ఉన్న కాతేరులోని కంత మణివారి వీధికి వెళ్లిన పెనుమాక సునీల్‌కుమార్ కనిపించడం లేదని అతని భార్య పెనుమాక మాణిక్యం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం

స్థానిక పేపర్ మిల్లులో ఉద్యోగం చేస్తున్న పెనుమాక సునీల్‌కుమార్ ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో హుకుంపేటలోని జనచైతన్య లే అవుట్‌లోని అత్తగారింటి నుంచి ఏపీ 39 ఎంపీ 3018 నెంబరు రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదని బొమ్మూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మాణిక్యం పేర్కొంది. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సునీల్‌కుమార్ ఆచూకీ తెలిసినా, మోటారు బైక్ ఆచూకీ తెలిసినా బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ 94407 96533, 94911 22811 ఫోన్ నెంబరులో తనకు తెలియజేయాలని ఎస్సై రమేష్ కోరారు.

రారండోయ్ రాములోరి కల్యాణానికి..

- సత్యదేవుడు అమ్మవార్లు పెళ్లిపెద్దలుగా వధూవరులైన సీతారాములు
- పసుపు దంచిన ముత్తయిదువలు
- రత్నగిరి క్షేత్ర పాలకుడు సీతారాముని కల్యాణం నేడు



రామాలయంలో సీతారాములను వధూవరులను చేస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి క్షేత్ర పాలకుడైన శ్రీరాముని ఆలయంలో నవమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. చైత్ర శుద్ధ అష్టమి శనివారం సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్లు పెళ్లిపెద్దలుగా రాగా సాయంత్రం నాలుగు గంటలకు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వధూవరులుగా తీర్చిదిద్దారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు నూతన పట్టు వస్త్రాలను సమర్పించారు.

అనంతరం ముత్తయిదువులతో పాటు ఈఓ సుబ్బారావు కొంతసేపు పసుపు దంచారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాలను ప్రధాన అర్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమంద్ర శర్మ, చిట్టి శివ, రామాలయ అర్చకుడు దేవులపల్లి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేడు సీతారాముల కల్యాణం

సీతారాముల కల్యాణాన్ని ఆదివారం ఉదయం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉదయం ఏడు గంటలకు సీతారాములను వెండి హనుమద్వాహనంపై, పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అమ్మవారిని పల్లకీ మీద గ్రామంలో ఊరేగిస్తారు. అనంతరం రత్నగిరి రామాలయం వద్ద వార్షిక కల్యాణవేదికపై ఉదయం పది నుంచి ఒంటి గంట వరకూ సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ ముహూర్తంలో మాంగల్యధారణ జరుగుతుంది. అనంతరం భక్తులకు ప్రసాదం, వడపప్పు పానకం పంపిణీ చేస్తారు.

తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు

రోజుకొక వేడుకతో శ్రీరామ నవమిని తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తారు. ఏప్రిల్ 13వ తేదీ రాత్రి ఏడు గంటలకు రామాలయంలో జరిగే శ్రీసీతారాముల శ్రీపుష్పయాగోత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయి.



ముత్తయిదువులతో కలిసి పసుపు దంచుతున్న దేవస్థానం ఈఓ సుబ్బారావు దంపతులు

అందరి బంధువయా..

- ప్రతి ఒక్కరి ఇంటి పేరుతో రామాలయాలు
- రాష్ట్రంలో ఖ్యాతిగడించిన రాములోరి బంధం

పెరవలి: భారత దేశంలో రామాలయం లేని గ్రామం ఉండదన్నది జగమెరిగిన సత్యం. ఎక్కడైనా కోదండ రాముడు, కల్యాణ రాముడు, సీతారాముడు ఇలా సర్వ జగద్రక్షకుడిగా ఆయా ఊళ్లలో కొలువై ఉండడం సహజమే. సరే.. అంతా బాగానే ఉంది కానీ.. జగద్రక్షణ మా ఇంటి నుంచే ప్రారంభించు రామయ్యా అంటున్నారు ఆ ఊరి జనం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ గ్రామంలో 20 రామాలయాలు ఉన్నాయి. అదేమంత గొప్పంటారా? అదేమరి.. ఆ రామయ్యలను పలకరించి విషయమేంటో తెలుసుకోవాలంటే పెరవలి మండలం ఖండవిల్లి వెళ్లాల్సిందే మరి. అద్గదీ విషయం. ఇక్కడి రామయ్యలు ఇంటి పేరున కులం పేరున కొలువై ఉన్నారండీ. కాపులు, రాజులు, శెట్టి బలిజ, గౌడ, రజకులు, మాలలు, మాదిగలకు, బ్రాహ్మణులు ఇలా ఒకటేమిటి అన్ని వర్గాలకు వారి పేరుతో ఒకొక్క రామాలయంలో కొలువుదీరి వారి వర్గాన్ని రక్షిస్తున్నారు. ఈ గ్రామ జనాభా 18 వేలు కాగా, 1756లో గ్రామంలో ఒకే రామాలయం ఉండేది. అదీ మారుమొఖం రామాలయం (జంగాల వీధిలో) ఉండేది. గ్రామస్తులంతా ఇక్కడే శ్రీరామనవమి వేడుకలు చేసేవారు. కాలక్రమేణా జనాభా పెరగి కులానికో రామాలయం వెలసింది. ఇది మరింత విస్తరించి ఇంటిపేరున సైతం రాములోరిని సొంతం చేసుకున్నారు. ఇలా ప్రస్తుతం గ్రామంలో 20 రామాలయాలు ఉన్నాయి. అంతే కాకుండా ఈ గ్రామానికి హేమ్లెట్ గ్రామాలు అయిన లంకమాలపల్లి, బొక్కావారిపాలెం, గవర్లపాలెం, ఎర్రవంతెన గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఉన్న రామమందిరాలను సైతం కలిపితే మరో పది పెరుగుతాయి. శ్రీరామ నవమి వచ్చిందంటే చాలు ఈ గ్రామమంతా శ్రీరామనామం కర్ణామృతమై వీనువిందు చేస్తుంది.



శెట్టిబలిజ రామాలయం



కాపుల రామాలయం

జగన్మోహనం.. శివకేశవ క్షేత్రం

- భక్తులను ఆకట్టుకునే ద్విముఖ రూపాలు
- కోరిన కోర్కెలు నెరవేర్చే దివ్య స్వరూపం
- ప్రపంచ ప్రసిద్ధి చెందిన ర్యాలి క్షేత్రం
- నేటి నుంచి కళ్యాణ మహోత్సవాలు

కొత్తపేట: ముందు పురుషరూపం, వెనక స్త్రీ రూపంతో ఏకశిలలో జగన్మోహినీ, విష్ణువు సాక్షాత్కరించే అద్భుత క్షేత్రం ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయం. అణువణువునా ఆధ్యాత్మికత ఉట్టిపడే క్షేత్రం ర్యాలి. ఈ క్షేత్రంలో ఈ నెల 6 నుంచి 13 వరకూ స్వామివారి కళ్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఈ దేవాలయం ఆరో స్థానాన్ని దక్కించుకని ఖ్యాతికెక్కింది. ఈ క్షేత్రంలో ముందు భాగం కేశవుని రూపం, వెనుక జగన్మోహినీగ స్వయంభూగా అవతరించారు. ఈ క్షేత్రాన్ని దర్శిస్తే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల విశ్వాసం. ఏకశిలా విగ్రహం ఉన్న ఈ ఆలయంలో అణువణువునా ఉన్న అద్భుతాలు భక్తి భావాలను పెంపొందిస్తాయి. ఈ ఆలయంలో భక్తులందకీ గర్భాలయ ప్రవేశం ఉండటం విశేషం. అంతే కాక ఈ ఆలయానికి ఎదురుగానే పడమర వైపు ఉమా కమండలేశ్వర స్వామి ఆలయం ఉండటం ఒక విశేషం. కాగా శివాలయంలో నీరు ఇంకి పోవడం, శ్రీజగన్మోహనుడి ఆలయంలో స్వామి వారి పాదముల నుంచి నిరంతరం నీరు (గంగ) ఉద్భవించడం సృష్టి రహస్యాలుగా చరిత్ర చెప్తోంది.

ఆలయ విశిష్ట చరిత్ర

ఈ ఆలయ ప్రత్యేకతలకు తగినట్లే ఆ దైవం వెలిసిన విధానం కూడ ఒక చరిత్ర సంతరించుకుంది. ఈ ఆలయంలో దైవం, రాక్షస సంహారంలో భాగంగా ఏర్పడిన ఒక అవతారమని చారిత్రక కథనం. ఇటు గౌతమి అటు వశిష్ట నదీ పాయల మధ్య ఆవిర్భవించిన ఈ ఆలయ స్థాపనకు, ఈ గ్రామానికి ర్యాలి అన్న పేరు రావడానికి కూడా ఒక కథ ఉన్నట్టు పండితులు వెల్లడిస్తున్నారు. విక్రమదేవుడు అనే భక్తుడు ఒకప్పుడు అడవిలా ఉన్న ప్రాంతంలో వేట సాగిస్తూ ఒక చెట్టు వద్ద నిద్రించాడు. అతనికి కలలో కనబడిన మహావిష్ణువు స్వయంభూ శిల రూపంలో నేను ఈప్రాంతంలో ఉన్నానని నీవు కర్రతో రథం చేయించి లాగుకొని వెళ్ళితే ఆ రథం శీల రాలి పోతుందని అక్కడ తవ్వితే విగ్రహం బయట పడుతుందిని చెప్పి అదృశ్యమయ్యాడని ఒక కథ ప్రచారంలో వుంది. ఆ ప్రకారం విక్రమ దేవుడి ద్వారా ఈ విగ్రహం బయట పడిందని చరిత్ర చెబుతోంది. రథం శీల రాలడం వలన ఈ దైవం వెలసిన ప్రాంతానికి ×ర్యాలి૨ అని పేరు వచ్చిందని నానుడి.

పాప సంహారం కోసం వెలసిన దైవం

అమృతం కోసం తగవులాడుకుంటున్న దేవదానవులను శాంతిపజేసి దానవులకు అమృతం అందకుండా చేసేందుకు మహా విష్ణువు జగన్మోహినీగా ఈ లోకంలో అవతరించిన విషయం తెలిసిందే. ఆ ఘట్టం ముగిసిన తరువాత అత్యంత సుందరంగా ఉన్న జగన్మోహినిని మోహించిన శంకరుడు ఆమెను వెంటాడటంతో స్త్రీ రూపంలో ఉన్న విష్ణుమూర్తి ర్యాలి గ్రామం వరకూ వచ్చి ఇక్కడ అంతర్థానమైనట్టు ఆలయ చరిత్రకారులు వెల్లడిస్తున్నారు. ఆ సమయంలో వీరిద్దరూ మోహించుకోవడాన్ని సర్వజనానికి తెలిసేటట్టు చేయడం కోసం స్త్రీ పురుష రూపాల్లో ఏక శిలలో లోకనాథులు ఇద్దరూ ఇక్కడ స్వయంభూలుగా వెలిశారని భక్తులు విశ్వాసం



కేశవస్వామివారు (ముందు రూపం)
జగన్మోహినీ అమ్మవారు (వెనుక రూపం)



స్వామి వారి ఆలయం

అడుగడుగునా అద్భుతాలే

లోకనాథులు వెలసిన ఈ గ్రామంలో జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో అణువణువునా అద్భుతాలే కనిపిస్తాయి. అత్యంత ఎత్తయినా పురాతన నిలువు గోపురం అందరినీ ఆకర్షించే గర్భగుడితో పాటు శ్రీదేవి, భూదేవి విగ్రాహాలు సైతం ఎంతగానో అకర్షిస్తాయి. ఇవి అన్ని ఒక ఎత్తయితే ప్రపంచంలోనే అత్యంత అద్భుతమైన వింత. ఈ ఆలయ ప్రధాన విగ్రహమే ఐదు అడుగుల ఎత్తున ఉన్న సాలగ్రామ ఏక శిలలో స్త్రీ పురుష రూపాల్లో శివ కేశవులు సాక్షాత్కరించడం భక్తి పారవశ్యాన్ని పెంపొందిస్తుంది. ఈ ఒక్క శిలలోనే రెండు విధాలైన ఆలయాలు, పొన్న చెట్టు, దక్షిణ భాగంలో గోవర్ధన పర్వతం, మకర తోరణం స్పష్టంగా కనిపిస్తాయి. ఈ సాలగ్రామ ఏక శిలా విగ్రహంలోనే దశావతారాలు కన్పించడం మరో అద్భుత విశేషం. కంఠంలోని హారాలు, కర కంకణాలు, శంకు చక్రాలు జీవం ఉట్టి పడేలా శివకేశవులే మన ముందు ప్రత్యక్ష మయ్యినట్టుగా చూసేవారికి అనుభూతి కలుగుతుంది. సాలాగ్రామ విగ్రహం పాదాల వద్ద గంగా జలం నిత్యం ఉబుకుతూనే ఉండడం ఇక్కడ మరో విశిష్టత. పాదాల వద్ద వున్న గంగాదేవి విగ్రహం నుంచి ఈ జలం ప్రవహిస్తూ నిత్యం ఆయన పాదాలను కడుగుతుందని భక్తుల విశ్వాసం. విగ్రహం వెనుక వైపు వున్న జగన్మోహినీ రూపం మరింత సమ్మోహనం. స్త్రీ రూపంలో వున్న మహావిష్ణువు అత్యంత సౌందర్యంగా కనిపిస్తారు. శిరమున సిగచుట్టూ అప్పుడే సంపెంగ నూనె రాసుకొన్నట్లున్న శిరోజాలు సహజమైన చీర కట్టు, తలలో ముచ్చటగొలిపే చామంతి పువ్వు విశేషంగా కనిపిస్తాయి. అంతేకాక పద్మినీ జాతి స్త్రీలకు శుభసూచకంగా ఉండేలా పుట్టుమచ్చలు సైతం ఈ విగ్రహంలో సాక్షాత్కరించడం భక్తులను తన్మయత్వంలో ఓలలాడిస్తుంది. ఈ ఆలయాన్ని సందర్శించాలంటే రాజమహేంద్రవరం నుంచి ర్యాలి చేరుకునేందుకు గంట సమయం పడుతుంది. రావులపాలెం చేరుకున్న భక్తులు అక్కడ నుంచి ఊబలంక మీదుగా ర్యాలి చేరుకునేందుకు ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వుంటుంది. రావులపాలెం బస్ కాంప్లెక్సు నుంచి రెండు గంటలకు ఒకసారి ఆర్టీసీ బస్ సౌకర్యం ఉండడంతో పాటు ప్రైవేటు వాహనాల ద్వారా ర్యాలి దివ్య క్షేత్రానికి చేరుకోవచ్చు.

కల్యాణ మహోత్సవాలు ఇలా..

ఆదివారం గరుడ వాహన సేవ, గ్రామోత్సవం, రాత్రి 8–45 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం, 7, 8, 9 తేదీల్లో స్వామివారికి అభిషేకం, తులసి పూజ, అమ్మవారికి కుంకుమార్చన, పదో తేదీన సదస్యం, 12న చక్రస్నానం, 13న శ్రీపుష్పోత్సవంతో కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు.

పెన్షన్ సొమ్ము గోల్‌మాల్

- రూ.2.74 లక్షలు బెట్టింగ్‌లో పెట్టిన వెల్ఫేర్ అసిస్టెంట్
- లబ్ధిదారులకు ఎగనామం
- పోలీసులకు ఎంపీడీఓ ఫిర్యాదు

కాజులూరు: కాకినాడ జిల్లా కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో గోల్‌మాల్ జరిగింది. వివరాలివీ.. తన పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లుగా పంపిణీ చేసేందుకు స్థానిక గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సలాది ధనరాజు ఈ నెల 1న రూ.2.74 లక్షలు తీసుకున్నాడు. అయితే, ఆ మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టి, ఓడిపోయాడు. పింఛన్లు అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో స్థానిక నాయకులు కొందరు జోక్యం చేసుకుని, విషయం బయటకు పొక్కకుండా సర్దుబాటు చేసేందుకు ప్రయత్నించారు. అయితే, విషయం తెలుసుకున్న ఎంపీడీఓ జె.రాంబాబు వెల్ఫేర్ అసిస్టెంట్ ధనరాజుపై గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ధనరాజు ఐదు నెలల క్రితం కూడా ఇదేవిధంగా లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన సొమ్ము రూ.లక్ష గోల్‌మాల్ చేశాడని, అప్పట్లో కూడా స్థానిక నాయకులు కొందరు కలుగజేసుకుని, బాధితులకు సొమ్ము అందజేసి సమస్య సర్దుబాటు చేశారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై సంబంధిత గ్రామ సచివాలయ కార్యదర్శి జలాల్, ఎంపీడీఓ రాంబాబును వివరణ కోరగా, పెన్షన్ సొమ్ము గోల్‌మాల్ వాస్తవమేనని చెప్పారు. అయితే లబ్ధిదారులకు చేరాల్సిన సొమ్మును గ్రామ పెద్దల సమక్షంలో దశల వారీగా నిందితుని కుటుంబ సభ్యులతో పంపిణీ చేయించామని తెలిపారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

ఇసుకాసురుల దాహానికి నిండు ప్రాణం బలి

- గోదావరి నదిలోని గోతిలో జారిపడి యువకుడి మృతి
- కుటుంబానికి న్యాయం చేయాలంటూ నిరసన



దుర్గాప్రసాద్ మృతదేహం



గోదావరి నది నుంచి మృతదేహాన్ని తీసుకొస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం: కూటమి నేతల ఇసుక దాహానికి నిండు ప్రాణం బలైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదారిలంక ర్యాంపు వద్ద గోదావరి నదిలోకి స్నానానికి దిగిన యువకుడు, కొత్తపేట మార్కెట్ వీధికి చెందిన మాంసం విక్రయ వ్యాపారి రొట్టా దుర్గాప్రసాద్ (21) మృతి చెందాడు. దుర్గాప్రసాద్, మరో నలుగురు యువకులు శనివారం గోదావరి నదిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో ఇసుక తవ్విన లోతైన గుంతలో దుర్గాప్రసాద్ గల్లంతయ్యాడు. సమాచారం అందుకొన్న రెవెన్యూ అధికారులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, ఎస్సై డి.రవికుమార్ ఘటనా స్థలంలో శవపంచనామా ప్రక్రియ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతదేహాన్ని తరలించడానికి వీలులేదంటూ మృతుని బంధువులు, కొత్తపేట మార్కెట్ వీధికి చెందిన వారు నిరసన తెలిపారు. ఇసుక ర్యాంపు వద్ద లోతైన గుంతలే దుర్గాప్రసాద్ మృతికి కారణమని, ప్రభుత్వం బాధ్యత తీసుకొని మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతదేహం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వ అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకూ మృతదేహాన్ని తరలించనివ్వబోమంటూ రాత్రి కూడా నిరసన కొనసాగించారు.

కూటమి నేతల ఇసుక దాహం ప్రమాదభరితం

ప్రభుత్వ ఇసుక విధానం గ్రామానికి చెందిన కూటమి నేతలకు కాసులు కురిపించేదిగా ఉంది. దాంతో నిబంధనలను తుంగలోకి తొక్కుతూ విచ్చలవిడిగా గ్రామానికి చెందిన కూటమి నేతల ప్రోద్బలంతో అక్రమంగా ఇసుక తవ్వి సొమ్ము చేసుకున్నారు. ఈ తవ్వకాలతో ర్యాంపు వద్ద లోతైన గుంతలు ఏర్పడ్డాయి. ఇది తెలియని వారు స్నానాలకు దిగుతూ ఉండగా స్థానికులు చూసినప్పుడు దిగవద్దంటూ ఇసుక గుంతల ప్రమాదంపై హెచ్చరిస్తున్నారు. అలా సాధ్యం కాని పరిస్థితిలోనే దుర్గాప్రసాద్ ప్రమాదవశాత్తూ నదిలో గల్లంతై మృత్యువాత పడ్డాడు. ర్యాంపులో అక్రమంగా రాత్రింబవళ్లు ఇసుక తవ్వకాలు జరుపుతున్నారంటూ స్థానిక ప్రజాప్రతినిధులు గతంలో జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాలపై కొద్ది రోజులు ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. తర్వాత తిరిగి కొనసాగించారు.

క్రీడాకారులను తయారుచేద్దామా?

- కోచ్ కావాలనుకునేవారి నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- ఆరు వారాల పాటు శిక్షణ ఇవ్వనున్న క్రీడాప్రాధికార సంస్థ
- ఈ నెల 14 తుది గడువు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడమే కాదు.. అయా స్థాయిల్లో క్రీడాకారులను తయారు చేసేందుకు, వారికి తర్ఫీదు ఇచ్చేందుకు భారత క్రీడాప్రాధికార సంస్థ అవకాశం కల్పిస్తోంది. క్రీడా శిక్షకుడిగా ఎదగాలని, పిల్లలకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని భావిస్తున్న వారి కోసం భారత క్రీడా ప్రాధికార సంస్థ ఓ వేదికను ఏర్పాటు చేసింది. ఇది వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి చాలా మంది శిక్షణను పూర్తి చేసుకుని ధ్రువపత్రాలు సాధించారు. నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో 23 క్రీడాంశాల్లో ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

ఇంటర్మీడియెట్, ఆపై..


ఇంటర్మీడియెట్, ఆపై ఉత్తీర్ణత సాధించి 20 నుంచి 42 ఏళ్లలోపు అభ్యర్థులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది. జిల్లాస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో తొలి మూడు స్థానాలు, రాష్ట్ర స్థాయి ఆలిండియా, వర్సిటీ చాంపియన్‌షిప్, జోనల్ ఇంటర్ యూనివర్శిటీ స్థాయి పోటీలలో ప్రాతినిధ్యం, ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలలో జూనియర్, సీనియర్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉండాలి.

ఏయే అంశాల్లో ....

సైక్లింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, ఖోఖో, రోయింగ్, సాఫ్ట్‌బాల్, షూటింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, ఉషూ, యోఆ, త్రోబాల్ తదితర క్రీడాంశాలుంటాయి.

శిక్షణ కేంద్రాలు

క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడ ఆధారంగా శిక్షణ కేంద్రాన్ని కేటాయిస్తారు. వారు యూనిఫాంతో పాటు సాధారణ దుస్తులు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. పంజాబ్ రాష్ట్రం పటియాలా, కర్ణాటక రాజధాని బెంగళూరు, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కత్తాలలో ఎన్‌ఎస్‌ఎన్‌ఐఎస్ శిక్షణా కేంద్రాలు ఉన్నాయి.



డీఎస్‌ఏ ముఖద్వారం

మే 6 నుంచి జూలై 2 వరకు శిక్షణ...

ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సులో 30 రోజులు థియరీ, 14 రోజులు ప్రాక్టికల్స్ ఉంటాయి. మే 6 నుంచి జూలై 2 వరకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఉంటుంది. దరఖాస్తుకు ఆఖరు తేదీ ఈనెల 14.

మంచి అవకాశం



క్రీడారంగంపై ఆసక్తి ఉన్న వారి కోసం భారత క్రీడా ప్రాధికార సంస్థ మంచి అవకాశం కల్పిస్తోంది. ఆరు వారాల పాటు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చి వారికి శిక్షకులుగా గుర్తింపు ఇవ్వనుంది. వివరాలకు 89196 42248 నెంబరులో సంప్రదించండి.

– శ్రీనివాస్ కుమార్, డీఎస్‌డీఓ